క్లుప్తంగా

పారిశుద్ధ్య పనుల పరిశీలన



పెడన: మునిసిపల్ చైర్ పర్సన్ కటకం నాగ కుమారి ఆదేశాల మేరకు గత కొన్ని రోజులుగా పెడన పట్టణంలో జరుగుతున్న స్పెషల్ శానిటేషన్ పనులను గురువారం వైస్ చైర్మన్ ఎండీ ఖాజా, సీనియర్ కౌన్సిలర్ కటకం ప్రసాద్ మునిసిపల్ అధికారులతో కలిసి పరిశీలించారు. బంటుమిల్లి రోడ్డుకు ఇరువైపులా జంగిల్ క్లియరెన్స్, మట్టి దిబ్బల తొలగింపు, మొదలగు పనులను పరిశీలించి సిబ్బందికి, అధికారులకు దిశానిర్దేశం చేశారు. మునిసిపల్ కమిషనర్ ఎల్. చంద్రశేఖరరెడ్డి, ఏఈ కాగిత సీతారామాంజనేయులు తదితరులున్నారు.

ఆక్రమణకు గురైన ప్రభుత్వ భూములను స్వాధీనం చేసుకోవాలి

కృత్తివెన్ను: ఇంతేరు పంచాయతీ పరిధిలో ఆక్రమణకు గురైన 3,501 ఎకరాల అటవీశాఖ భూములను ప్రభుత్వం స్వాధీనం చేసుకోవాలని సామాజిక కార్యకర్త జంపాన శ్రీనివాసగౌడ్ గురువారం ఓ ప్రకటనలో కోరారు. ఇప్పటికే దీనిపై లోకాయుక్తలో కేసు నడుస్తోందని, జిల్లా ఉన్నతాధికారులతో కమిటీ సైతం ఏర్పాటైనట్లు వివరించారు. ప్రభుత్వ భూములున్న చోట ఆక్వాసాగు చేస్తు అనధికారికంగా విద్యుత్ సరఫరాను సైతం ఏర్పాటు చేశారన్నారు. దీనిపై పూర్తిస్థాయిలో విచారణ జరిపి ప్రభుత్వ భూములను స్వాధీనం చేసుకోవాలని ఆయన కోరారు.

నేడు 'చలో బందరు మెడికల్ కాలేజీ'

పెడన: ప్రభుత్వ మెడికల్ కాలేజీలను ప్రైవేటీకరణను నిరసిస్తూ ఈ నెల 19న శుక్రవారం ఉదయం చలో మచిలీపట్నం మెడికల్ కాలేజ్ కార్యక్రమాన్ని తలపెట్టినట్లు పెడన వైఎస్సార్ సీపీ కార్యాలయం గురువారం ఓ ప్రకటనలో పేర్కొంది. ఆ రోజు ఉదయం 9 గంటలకు మచిలీపట్నంలోని గాడెల్లి డేవిడ్ ఇంటి వద్ద నుంచి మెడికల్ కాలేజీకి శాంతియుతంగా వెళ్లి వాస్తవ పరిస్థితులను మీడియా ద్వారా ప్రజలకు తెలియజేయడమే లక్ష్యంగా వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. పెడన నియోజకవర్గంలోని వైఎస్సార్ సీపీ కుటుంబ శ్రేణులంతా హాజరై జయప్రదం చేయాల్సిందిగా పార్టీ కార్యాలయం పేర్కొంది.

రేషన్ సరుకులు సక్రమంగా పంపిణీ చేయాలి

మోపిదేవి: రేషన్ షాపుల ద్వారా అందిస్తున్న నిత్యావసర సరుకులు సక్రమంగా లబ్ధిదారులకు అందించాలని తహసీల్దార్ ఎం. హరనాథ్ తెలిపారు. తహసీల్దార్ కార్యాలయంలో గురువారం సాయంత్రం రేషన్ డీలర్స్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో తహసీల్దార్ మాట్లాడుతూ ప్రభుత్వం నూతనంగా అందించిన స్మార్ట్ రైస్ కార్డులు లబ్ధిదారులందరికీ పూర్తిస్థాయిలో పంపిణీ చేయాలని ఆదేశించారు. గుర్తించిన వృద్ధులు, వికలాంగులకు వారి ఇంటి వద్దనే రేషన్ అందించాలని తెలిపారు. అనంతరం కొత్తగా వచ్చిన తహసీల్దార్‌ను డీలర్లు సంఘం ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించాలని ధర్నా



మచిలీపట్నంటౌన్: చాలీచాలని జీతాలు, నిత్యావసర వస్తువుల ధరలు విపరీతంగా పెరిగిపోవడంతో మునిసిపల్ కార్మికుల జీవనం దుర్భరంగా మారిందని ఏపీ మునిసిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ కృష్ణా జిల్లా ప్రధాన కార్యదర్శి బూర సుబ్రహ్మణ్యం ఆందోళన వ్యక్తం చేశారు. స్థానిక నగర పాలకు సంస్థ కార్యాలయం ప్రధాన ద్వారం వద్ద మునిసిపల్ కార్మికులు గురువారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మునిసిపల్ కార్మికులకు 12వ పీఆర్సీ ప్రకారం వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ కార్మికులను రెగ్యులర్ చేయాలన్నారు. ప్రతినెల మొదటి వారంలోనే వేతనాలు చెల్లించాలన్నారు. యూనియన్ నగర అధ్యక్షురాలు చోక్కాకుల బుల్లెమ్మ, కార్యదర్శి శీరంశెట్టి దుర్గాప్రసన్నడు, ఏ స్వప్న, ఎస్. దుర్గభవాని, సంఘం రెడ్డి కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

'స్వచ్ఛతాహీ సేవ'పై అవగాహన అవసరం

కలెక్టర్ డీకే బాలాజీ



స్వచ్ఛతాహీ సేవ పోస్టర్‌ను విడుదల చేస్తున్న కలెక్టర్ బాలాజీ

చిలకలపూడి(మచిలీపట్నం): పరిసరాల పరిశుభ్రత ప్రాముఖ్యతను తెలియజెప్పేలా స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమంపై ప్రజల్లో అవగాహన కల్పించేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ డీకే బాలాజీ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లోని ఆయన చాంబర్‌లో వివిధ శాఖల అధికారులతో గురువారం సమీక్ష నిర్వహించారు. అనంతరం పోస్టర్‌ను ఆవిష్కరించారు. కలెక్టర్ మాట్లాడుతూ స్వర్ణాంధ్ర - స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా ఈ నెల 17 నుంచి అక్టోబర్ 2వ తేదీ వరకు స్వచ్ఛతాహీ కార్యక్రమంపై ప్రజలకు విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. భారతదేశాన్ని పరిశుభ్రంగా ఉంచే లక్ష్యంతో ప్రారంభించిన స్వచ్ఛ భారత్ మిషన్ అమలులో భాగంగా ప్రజలందరినీ భాగస్వామ్యులను చేయాలన్నారు. గ్రామాలను బహిరంగ మలవిసర్జన రహితంగా మార్చటమే లక్ష్యమన్నారు. దీని కోసం జిల్లాలో 10వేల జనాభా కలిగిన 16గ్రామ పంచాయతీలను గుర్తించామన్నారు. ఆ గ్రామాల్లో ఆకాంక్ష మరుగుదొడ్ల నిర్మాణం చేపట్టాలని అందుకు గ్రామానికి దూరంగా కాకుండా దగ్గర్లోని అనువైన స్థలాలను గుర్తించాలని ఆయన అధికారులకు సూచించారు. సమావేశంలో ఆర్‌డబ్ల్యూఎస్ ఇన్‌చార్జ్ అధికారి సోమశేఖర శ్రీనివాసులు, పంచాయతీరాజ్ ఎస్‌ఈ రమణారావు, డ్వామా పీడీ ఎన్‌వీ శివప్రసాద్, ఆర్‌అండ్‌బీ ఈఈ లోకేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

పోర్టులో పచ్చదనాన్ని పెంపొందించండి

చిలకలపూడి(మచిలీపట్నం): మచిలీపట్నం పోర్టు ప్రాంతంలో విరివిగా మొక్కలు నాటి పచ్చదనాన్ని పెంపొందించడానికి చర్యలు తీసుకోవాలని కలెక్టర్ డీకే బాలాజీ అన్నారు. కలెక్టరేట్‌లోని ఆయన చాంబర్‌లో గురువారం ఏపీ మారిటైం బోర్డు, మెగా సంస్థ, రైట్స్, మునిసిపల్, అటవీశాఖ అధికారులతో పోర్టు గ్రీన్ యాక్షన్ ప్లాన్‌కు తీసుకోవాల్సిన చర్యలపై వివరించారు. కలెక్టర్ మాట్లాడుతూ పోర్టు ప్రాంతంలో 266ఎకరాల్లో మొక్కలు నాటి పచ్చదనాన్ని పెంపొందించేందుకు ప్రణాళిక రూపొందించినప్పటికీ ఇప్పటి వరకు ఎటువంటి చర్యలు తీసుకోలేదన్నారు. పచ్చదనాన్ని పెంపొందించేందుకు ప్రతిపాదించిన భూమిని అటవీశాఖ అధికారులకు చూపించాలని ఆలస్యం చేయకుండా మొక్కలు నాటాలని కలెక్టర్ సూచించారు. సమావేశంలో జిల్లా అటవీశాఖ అధికారి సునీత, ఏపీ మారిటైం బోర్డు ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ పుల్లారావు, మెగా సంస్థ డీజీఎం రాఘవేంద్రరావు, రైట్స్ సోషల్ సేఫ్ గార్డ్ ధీరేంద్రకుమార్, మునిసిపల్ కమిషనర్ బాపిరాజు పాల్గొన్నారు.

ప్రధాన మంత్రి అవాస్ యోజన పోస్టర్ ఆవిష్కరణ..

చిలకలపూడి(మచిలీపట్నం): మచిలీపట్నం నగర పరిధిలో ప్రధానమంత్రి ఆవాస్ యోజన పథకాన్ని అవగాహన కల్పించేందుకు సంబంధించిన పోస్టర్లను గురువారం సాయంత్రం కలెక్టర్ డీకే బాలాజీ ఆవిష్కరించారు. లబ్ధిదారులకు పథకం ప్రయోజనాలను తెలియజేయటం కోసం, పీఎం సూర్య ఘర్ ఉచిత విద్యుత్ యోజన ప్రయోజనాలు లబ్ధిదారులకు చేరవేయటం కోసం అవగాహన కల్పించాలని ప్రచార కార్యక్రమాన్ని చేపట్టినట్లు తెలిపారు. కార్యక్రమంలో హౌసింగ్ ఇన్‌చార్జ్ పీడీ పోతురాజు, కమిషనర్ బాపిరాజు తదితరులు పాల్గొన్నారు.

కలెక్టర్‌ను కలిసిన డీడీవో సునీతశర్మ



చిలకలపూడి(మచిలీపట్నం): కలెక్టర్ డీకే బాలాజీని ఆయన చాంబర్‌లో గురువారం గుడివాడ డివిజనల్ డెవలప్‌మెంట్ ఆఫీసర్ డీడీవోగా నియమితులైన సునీతశర్మ మర్యాదపూర్వకంగా కలిసి మొక్కను అందజేశారు. ఎన్టీఆర్ జిల్లా ఇబ్రహీంపట్నం ఎంపీడీవోగా పనిచేస్తున్న సునీతశర్మ ఉద్యోగోన్నతిపై గుడివాడ డీడీవోగా నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ నేపథ్యంలో ఆమె కలెక్టర్‌ను మర్యాదపూర్వకంగా కలిసిన అనంతరం బాధ్యతలు స్వీకరించారు.

మహిళా ఆరోగ్యంపై అవగాహన ర్యాలీ

చల్లపల్లి: స్థానిక కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో గురువారం వైద్యులు, సిబ్బంది ర్యాలీ నిర్వహించారు. ర్యాలీలో పాల్గొన్న మచిలీపట్నం ప్రభుత్వ ఆస్పత్రి సూపరింటెండెంట్ ఎ.వి.శేషుకుమార్ మాట్లాడుతూ స్వస్థ్ నారీ-సశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా ర్యాలీ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆస్పత్రిలో మహిళలకు కంటి పరీక్షలు నిర్వహించి తగు సూచనలు చేసినట్లు చల్లపల్లి ప్రభుత్వ ఆస్పత్రి సూపరింటెండెంట్ బీఎస్ఆర్ శ్రీనివాస్ చెప్పారు. కార్యక్రమంలో వైద్యులు అవినాష్, ఇతర వైద్యులు పాల్గొన్నారు.



చల్లపల్లి కమ్యూనిటీ హెల్త్ సెంటర్ వద్ద ర్యాలీ నిర్వహిస్తున్న వైద్యులు, సిబ్బంది

ఆరోగ్యవంతమైన సమాజానికి మహిళల ఆరోగ్యం ముఖ్యం

లంకపల్లి(ఘంటసాల): మహిళల ఆరోగ్యంతోనే ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణం సాధ్యమని లంకపల్లి సర్పంచ్ డి.విజయలక్ష్మి అన్నారు. ఘంటసాల మండలంలోని లంకపల్లి గ్రామంలో స్వస్థ్ నారీ సశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమాన్ని వైస్ ఎంపీపీ మాడెం నాగరాజుతో కలిసి సర్పంచ్ గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఘంటసాల పాలెం పీహెచ్‌సీ డాక్టర్ నిఖితా ప్రసాద్ మాట్లాడుతూ మహిళలు ఆరోగ్యవంతంగా ఉండటానికి ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో మహిళలకు వైద్య పరీక్షలు, ఆరోగ్య సేవలు అందిస్తున్నట్లు తెలిపారు. అనంతరం ప్రజా ప్రతినిధులు, వైద్య ఆరోగ్యశాఖ అధికారులు, సిబ్బంది, అంగన్‌వాడీ కార్యకర్తలతో ర్యాలీ నిర్వహించారు. ఎంపీహెచ్‌ఈవోలు బాస్కరరావు, విజయదుర్గా, సీహెచ్‌ఓ ఎస్.దివ్య, ఎఎన్ఎం నాగమాధవి తదితరులు పాల్గొన్నారు.



లంకపల్లి ర్యాలీలో పాల్గొన్న సర్పంచ్ విజయలక్ష్మి, వైస్ ఎంపీపీ, వైద్య సిబ్బంది

మహిళలు శ్రద్ధ వహించాలి..

గూడూరు: మహిళలు ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని మల్లవోలు పీహెచ్‌సీ వైద్యాధికారి తరుణ్‌శంకర్ అన్నారు. స్వస్థ్ నారీ సశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా మండల పరిధిలోని నారికేడాలపాలెంలో వైద్య శిబిరం నిర్వహించి, రోగులకు 14 రకాల వైద్య పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ హెచ్‌వీ సరళ, సీహెచ్‌ఓ అనంత లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వీఏఏకు తీవ్ర గాయాలు

పెడన: మండల పరిధిలో చేవేంద్ర గ్రామంలో విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వర్తించడానికి బయల్దేరిన వి. గోపీనాథ్ ద్విచక్ర వాహనాన్ని ఆర్టీసీ బస్సు ఢీకొట్టడంతో గోపీనాథ్ తీవ్రంగా గాయపడ్డారు. గురువారం ఉదయం జరిగిన ఈ సంఘటనపై పెడన పోలీసులు, స్థానికులు తెలిపిన సమాచారం మేరకు.. పెడనలో అద్దెకు ఉంటున్న గోపీనాథ్(28) చేవేంద్ర గ్రామంలో వీఏఏ విధులకు హాజరయ్యేందుకు ద్విచక్ర వాహనంపై పెడన నుంచి బయల్దేరాడు. ఏలూరు నుంచి మచిలీపట్నం వస్తున్న హైయర్ ఆర్టీసీ బస్సు గుడివాడ రోడ్డులోని బైపాస్ రోడ్డు నుంచి పట్టణంలోకి వస్తుండగా.. ఓ వాహనాన్ని ఓవర్‌టేక్ చేసే సమయంలో ఎదురుగా వస్తున్న గోపీనాథ్ వాహనాన్ని ఢీ కొట్టింది. దీంతో గోపీనాథ్‌కు తీవ్ర గాయాలై పక్కకు పడిపోయాడు. పరిస్థితిని గమనించిన ఆర్టీసీ డ్రైవర్‌తో పాటు బస్సులోని వారంతా కిందకు దిగి గోపీనాథ్‌ను 108లో మచిలీపట్నం ప్రభుత్వాస్పత్రికి తరలించే పనిలో నిమగ్నమయ్యారు. విషయం తెలిసిన మరికొందరు వీఏఏలో సంఘటనా స్థలానికి చేరుకుని గోపీనాథ్ వెంట బయల్దేరి వెళ్లారు. మచిలీపట్నంలో చికిత్స అందించిన వైద్యులు మెరుగైన వైద్యం కోసం విజయవాడ తరలించారు. సంఘటన స్థలాన్ని పెడన సర్కిల్ ఇన్‌స్పెక్టర్ కె. నాగేంద్రప్రసాద్ పరిశీలించారు. పెడన పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



గోపీనాథ్‌ను 108 వాహనంలోకి ఎక్కిస్తున్న సిబ్బంది, సహచరులు

సమస్యలు పరిష్కరించాలని వీఆర్ఏల ధర్నా

బంటుమిల్లి: గ్రామ రెవెన్యూ అసిస్టెంట్లు(వీఆర్ఏలు) తమ దీర్ఘకాల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ గురువారం మండల సంఘం ఆధ్వర్యంలో ధర్నా చేసి తహసీల్దార్‌కు వినతి పత్రం సమర్పించారు. రాష్ట్ర సంఘం పిలుపు మేరకు మండల వీఆర్ఏల సంఘం ఆధ్వర్యంలో ధర్నా చేసి పే స్కేలు అమలు చేయాలని, అర్హులకు ప్రమోషన్లు ఇవ్వాలని, కారుణ్య నియామకాలు చేయాలని కోరుతూ తహసీల్దార్ కేవీ పూర్ణచంద్రరావుకు అందజేసిన వినతి పత్రంలో డిమాండ్ చేశారు. ఈ ధర్నాలో మండల సంఘం అధ్యక్షుడు అర్జా దయాకర్‌తో పాటు పలు గ్రామాల వీఆర్ఏలు పాల్గొన్నారు.

వీఆర్ఏలకు పే స్కేలు అమలు చేయాలి

ఘంటసాల: వీఆర్ఏలకు పే స్కేలు అమలు చేయడంతో పాటు అర్హులైన వారికి ఉద్యోగోన్నతులు కల్పించాలని వీఆర్ఏల సంఘం మండల అధ్యక్షుడు కె.మహేష్ అన్నారు. గ్రామ రెవెన్యూ సహాయకుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఏపీ వీఆర్ఏల సంఘం ఇచ్చిన పిలుపు మేరకు ఘంటసాల తహసీల్దార్ కార్యాలయం వద్ద మండల వీఆర్ఏలు నిరసన తెలియజేసి తహసీల్దార్ బి.విజయప్రసాద్‌కు గురువారం వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండలంలో సుమారు 30 మంది వీఆర్ఏలు ఉన్నామని, నిత్యావసరాలతో పాటు అన్ని ధరలు పెరిగిపోతున్నా వీఆర్ఏలకు కేవలం రూ.10,985 మాత్రమే జీతాలు ఇవ్వడం బాధాకరమన్నారు. కార్యక్రమంలో ఘంటసాల మండల వీఆర్ఏల సంఘం అధ్యక్షుడు కె.మహేష్, వీఆర్ఏలు సీహెచ్. బాలశ్రీను, కె.రవీంద్ర, బి.దేవకి, కె.మౌనిక, ఎల్.సుధాకర్, పి.అమృతం, కె.గోవిందు, కె.బాలశంకరరావు, పి.నాగ సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.



ఘంటసాల తహసీల్దార్ కార్యాలయం వద్ద నిరసన తెలుపుతున్న వీఆర్ఏలు

సామూహిక ఎలుకల నివారణతో రైతులకు మేలు



సామూహిక ఎలుకల నివారణపై రైతులకు అవగాహన కల్పిస్తున్న డీడీ మనోహరరావు

అవనిగడ్డ: సామూహిక ఎలుకల నివారణ కార్యక్రమం చేపట్టడం వల్ల రైతులకు ఎంతో మేలు జరుగుతుందని ఏడీఏ జయప్రద చెప్పారు. గురువారం సబ్ డివిజన్ పరిధిలోని అవనిగడ్డ, కోడూరు, నాగాయలంక, మోపిదేవి మండలాల్లో సామూహిక ఎలుకల నివారణ కార్యక్రమం చేపట్టినట్లు ఏడీఏ తెలిపారు. ఈ నాలుగు మండలాల్లో 23వేల హెక్టార్ల విస్తీర్ణానికి 230 కిలోల బ్రోమోడయోలిన్ అనే ఎలుకల నివారణ మందుని రైతులకు పంపిణీ చేసినట్టు చెప్పారు. అవనిగడ్డలో నిర్వహించిన కార్యక్రమంలో ఎంపీపీ తుంగల సుమతీదేవితో పాటు వ్యవసాయ శాఖాధికారులు పాల్గొన్నారు.

రైతులంతా కలిస్తేనే..

పెడన: రైతులంతా కలిసి ఎలుకల నివాణాలో పాలు పంచుకుంటేనే మంచి ఫలితాలుంటాయని జిల్లా వ్యవసాయశాఖ డెప్యూటీ డైరెక్టర్ మనోహరరావు అన్నారు. గురువారం నందమూరు గ్రామంలో సామూహిక ఎలుకల నివారణ కార్యక్రమంలో భాగంగా రైతులకు 100% రాయితీతో బ్రోమోడయోలిన్ మందును ఉచితంగా అందజేశారు. అనంతరం రైతులకు ఎలుకల నివారణపై అవగాహన కల్పించడమే కాకుండా వరి పంట పొలాలను పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులతో డీడీ మాట్లాడుతూ నూకలు 96 పాళ్లు, నూనె రెండు పాళ్లు, బ్రోమోడయోలిన్ మందు రెండు పాళ్లు కలుపుకొని పొట్లాలు కింద ఏలుకుల బొరియలు వద్ద పెట్టాలని సూచించారు. డీఆర్‌సీ డీడీఏ జ్యోతీరమణి, డీఆర్సీ ఏడీఈ శ్రీనివాసరావు, ఏవో ఎస్ జెన్నీ, డీఆర్సీ ఏవో పద్మజ, వీఏఏలు కీర్తి, సుభాష్, నందమూరు రైతులు పాల్గొన్నారు.

సామూహిక ఎలుకల నిర్మూలనపై అవగాహన..

నాగాయలంక: మండల వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో నాగాయలంక రైతు సేవా కేంద్రంలో గురువారం సామూహిక ఎలుకల నిర్మూలనపై రైతులకు అవగాహన, ఎలుకల నివారణ మందు పిచికారీపై డెమో ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఓ ఎ. సంజీవ కుమార్ మాట్లాడుతూ మండలంలోని అన్ని రైతు సేవా కేంద్రాల పరిధిలో మొత్తం వ్యవసాయ విస్తీర్ణానికి సరిపడా బ్రోమోడయోలిన్ మందు నూరు శాతం సబ్సిడీపై రైతులకు అందించినట్లు చెప్పారు.



ఎలుక మందు పొట్లాలు ఎలా తయారు చేయాలో వివరిస్తున్న ఏవో

ఎలుకల మందు తయారీపై అవగాహన..

రావివారిపాలెం(మోపిదేవి): పంటను నాశనం చేస్తున్న ఎలుకల సామూహిక నివారణకు రైతులు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని మండల వ్యవసాయాధికారి కె. హెప్సిబారాణి తెలిపారు. మండల కేంద్రం మోపిదేవి గ్రామ సచివాలయం-2 రైతు సేవా కేంద్రంలో ఎలుకలను సామూహికంగా నివారించడానికి బ్రోమోడయోలిన్ మందుతో ఎర తయారీ విధానాన్ని రైతులకు వివరించారు. సర్పంచ్ నందిగం మేరీరాణి, సహకార సంఘం సభ్యులు వీఏఏలు, పలువురు రైతులు పాల్గొన్నారు.

చెరువులు ఆన్‌లైన్ చేసుకుంటేనే ప్రభుత్వ పథకాలు

బంటుమిల్లి: చేపలు, రొయ్యలు సాగు చేస్తున్న రైతులు తమ చెరువులను ఆన్‌లైన్‌లో నమోదు చేసుకుంటేనే ప్రభుత్వం అందిస్తున్న రాయితీలు అందుతాయని ఎఫ్‌డీఓ సాయికృష్ణ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఏపీ ఆక్వా కల్చర్ డెవలప్‌మెంటు అథారిటీ యాక్ట్-2020 ప్రకారం ప్రతి ఒక్క రైతు తమ ఆక్వా చెరువును మత్స్య శాఖలో ఆన్‌లైన్ చేసుకోవలసి ఉంది. కానీ మండలంలో దాదాపు 11వేల ఎకరాలు ఆక్వా సాగు అవుతుండగా కేవలం సుమారు 2వేల ఎకరాలు మాత్రమే ఆన్‌లైన్ చేయడం జరిగిందని ఎఫ్‌డీఓ ప్రకటనలో తెలిపారు. కరెంటు రాయితీతో పాటు ప్రభుత్వం అందిస్తున్న పథకాలు ఏవీ అందాలన్నా రిజిస్ట్రేషన్ తప్పనిసరన్నారు.

నాటిన ప్రతి మొక్కను పరిరక్షించాలి

గూడూరు: పర్యావరణ పరిరక్షణకు పచ్చని చెట్లు ఎంతో దోహదం చేస్తాయని, నాటిన ప్రతి మొక్క పరిరక్షించుకోవడం ద్వారానే పర్యావరణ పరిరక్షణ సాధ్యమవుతుందని చిట్టిగూడూరు సర్పంచి లంకా చంద్రలీల అన్నారు. స్వచ్ఛతా పక్వాడ్‌లో భాగంగా చిట్టిగూడూరులోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో మొక్కలు నాటే కార్యక్రమం గురువారం నిర్వహించారు. పాఠశాలకు ట్రీగార్డులు అందజేసిన మచిలీపట్నంకు చెందిన గణపతి ఎంటర్‌ప్రైజెస్ వారిని అభినందించారు. పాఠశాల హెచ్‌ఎం జి.నవీన్‌బాబు ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో క్లస్టర్ హెచ్‌ఎం జి.వి జయకుమారి, గ్రామపెద్దలు పాల్గొన్నారు.

బ్యాంకు ఉద్యోగులు సేవాభావంతో పని చేయాలి

మచిలీపట్నంటౌన్: యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా బ్రాంచ్‌లో పనిచేస్తున్న ఉద్యోగులు ఖాతాదారులకు సేవా భావంతో పనిచేస్తూ వారి ఆదరాభిమానాలు పొందాలని ఆ బ్యాంకు మచిలీపట్నం ప్రాంతీయ అధికారి వెంకట్రావు సూచించారు. నగరంలో జరుగుతున్న రాష్ట్రస్థాయి కర్మయోగి శిక్షణ కార్యక్రమంలో వెంకట్రావు పాల్గొని ఉద్యోగులకు అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ మిషన్ కర్మయోగి పథకాన్ని పీఎం నరేంద్ర మోదీ ఆవిష్కరించారని, బ్యాంకు ఉద్యోగులు సాధారణ కర్మచారులుగా కాకుండా సేవా భావం, పారదర్శకత, కర్తవ్యం, నిబద్ధత కలిగి పనిచేయాలన్నారు. డెప్యూటీ రీజనల్ హెడ్స్ కొవ్వూరి ఉమా రామలింగ రెడ్డి, హేరంబ ప్రసాద్ దాస్, మాస్టర్ ట్రైనర్స్ పాల్గొన్నారు.

క్రీడాపోటీలు ప్రారంభం

మోపిదేవి: స్థానిక జెడ్పీ పాఠశాల ఆవరణలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో గురువారం మండల స్థాయి క్రీడా పోటీలు ప్రారంభించారు. ఉదయం క్రీడా పోటీలను పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు పి. జయంతి ప్రారంభించిన అనంతరం మాట్లాడుతూ పెదప్రోలు, వెంకటాపురం, పెదకళ్లేపల్లి, కోసూరువారిపాలెం, మోపిదేవి ఆశ్రమపాఠశాల, గురుకుల పాఠశాలల నుంచి పలువురు క్రీడాకారులు పాల్గొన్నారని తెలిపారు. కబడ్డీ, వాలీబాల్, షటిల్, చెస్ యోగ వంటి క్రీడలు నిర్వహించినట్లు తెలిపారు.

లాటరీ పద్ధతిలో బార్ షాపు కేటాయింపు

చిలకలపూడి(మచిలీపట్నం): లాటరీ పద్ధతిన గుడివాడ పట్టణంలోని బార్ షాపును గురువారం కేటాయించారు. ఎక్సైజ్‌శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ లాటరీలో గుడివాడ పట్టణానికి చెందిన బార్‌కు దరఖాస్తు చేసుకున్న వారిలో ఇన్‌చార్జ్ జేసీ కె. చంద్రశేఖరరావు డ్రా తీయగా.. మసిముక్కు జలాచంద్రుడుకు రావటంతో ఆయనకు ఈ బార్ షాపును కేటాయించారు. ఇప్పటి వరకు జిల్లాలో 43 బార్‌షాపులకు గానూ 32 బార్‌లను డ్రా పద్ధతిలో కేటాయించినట్లు ఎక్సైజ్ సూపరింటెండెంట్ జి. గంగాధరరావు తెలిపారు. ఇంకా జిల్లాలో 11 బార్‌లు కేటాయించాల్సి ఉందని ఆయన తెలిపారు.

సమస్యపై అర్జీ ఇస్తే.. అవమానిస్తారా?

అధికారుల తీరుపై మండిపడ్డ రైతు సంఘ నేతలు



అర్జీలు చూపుతున్న రైతు సంఘ నేతలు

కోడూరు: ప్రజా సమస్యల పరిష్కార వేదిక ద్వారా రైతులు ఇచ్చిన సమస్యలను పరిష్కరించకుండానే, సమస్య పరిష్కారమైందంటూ ఫోన్లకు మెసేజ్‌లు పంపి అన్నదాతలను అధికారులు అవమానిస్తున్నారంటూ రైతు సంఘం జిల్లా నేత ఆవుల బసవయ్య మండిపడ్డారు. గురువారం స్థానిక సంఘ కార్యాలయం వద్ద రైతు సంఘ నేతలు మాట్లాడారు. ప్రతి సోమవారం కలెక్టరేట్ వద్ద ప్రజా సమస్యలు తెలుసుకొనేందుకు ప్రభుత్వం ప్రత్యేక గ్రీవెన్స్ నిర్వహిస్తోందని, అయితే గ్రీవెన్స్ వల్ల ఏవిధమైన ప్రయోజనం లేదని బసవయ్య ఆగ్రహం వ్యక్తం చేశారు. దివిసీమలోని పంటపోలాల్లో మురుగు సముద్రంలోకి వెళ్లేందుకు దోహదపడే రత్నకోడు(తాలేరు) డ్రెయిన్ నుంచి న్యూ ఇరాలి డ్రెయిన్‌లోకి అక్రమంగా తూము ఏర్పాటు చేయడం వల్ల వేలాది ఎకరాలు మునుగుతున్నాయన్నారు. ఈ సమస్యపై జిల్లా కలెక్టర్‌కు మూడు సార్లు గ్రీవెన్స్‌లో అర్జీ ఇచ్చినట్లు బసవయ్య తెలిపారు. అయితే అధికారులు అక్రమ తూమును తొలగించకుండా సమస్య పరిష్కారమైయిందంటూ ఫిర్యాదు చేసిన రైతు ఫోన్‌కు మెసేజ్ పంపారని, ఇది ఎంతవరకూ సమంజసమని ప్రశ్నించారు. నేతలు రేపల్లె యోగ ప్రకాష్, చెక్కా మోహనరావు, జొన్నలగడ్డ గోపాలరావు, పోనమాల కోటయ్య పాల్గొన్నారు.

గర్భిణులు సమతుల్య ఆహారం తీసుకోవాలి



కృత్తివెన్ను: మహిళలు గర్భం దాల్చిన నాటి నుంచి సమతుల్య ఆహారాన్ని తీసుకోవాలని ఐసీడీఎస్ అధికారులన్నారు. గురువారం ఒర్లగొందితిప్పలోని 1,2 అంగన్‌వాడీ కేంద్రాలలో పోషణ్ అభియాన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. దీనిలో భాగంగా తల్లీబిడ్డల ఆరోగ్య సంరక్షణ చర్యలను వివరించారు. కాన్పుకు కాన్పుకు ఎంత వ్యత్యాసం ఉండాలో తెలిపారు. రోజువారీ భోజనంలో తప్పనిసరిగా ఆకుకూరలు, పప్పుదినుసులు ఉండేలా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. గర్భిణులు, బాలింతలు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఝాన్సీ, అంగన్‌వాడీ కార్యకర్తలు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

తల్లులు జాగ్రత్త వహించాలి..

ఘంటసాల: పిల్లల్లో ఊబకాయం రాకుండా తల్లులు జాగ్రత్త వహించాలని ఐసీడీఎస్ ఘంటసాల సెక్టార్ సూపర్ వైజర్ టి.రమా నాగమణి అన్నారు. ఘంటసాల-1 అంగన్‌వాడీ కేంద్రంలో పోషకాహార మాసోత్సవాలు గురువారం నిర్వహించారు. రమానాగమణి మాట్లాడుతూ ఊబకాయం గురించి తల్లులకు అవగాహన కల్పించారు. ఆహారంలో చక్కెర,నూనె వాడకం తగ్గించాలని, పిల్లలను ఫాస్ట్ ఫుడ్‌కు దూరంగా ఉంచాలని, కూల్ డ్రింక్స్ (శీతల పానీయాలు) తాగించకూడదన్నారు.

నేత్ర వైద్య శిబిరానికి విశేష స్పందన

తాడేపల్లి(ఘంటసాల): మండలంలోని తాడేపల్లి గ్రామంలోని మలయాళ స్వామి పెద్దాశ్రమంలో కృష్ణాజిల్లా బ్లైండ్‌నెస్ కంట్రోల్ సొసైటీ, చెన్నై శంకర నేత్రాలయ కంటి వైద్యశాల, సూరపనేని రామలింగయ్య-వెంకటరావమ్మ కుటుంబం సంయుక్త ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన ఉచిత కంటి పొర చికిత్స శిబిరానికి విశేష స్పందన లభించింది. తాడేపల్లి పెద్దాశ్రమంలో వారం రోజుల పాటు నిర్వహించే ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పేడు వ్యాసాశ్రమ పీఠాధిపతి పరిపూర్ణానందగిరి స్వామీజీ, అసంగానందగిరి స్వామీజీ, టీడీపీ నేత పరుచూరి సుభాష్ చంద్రబోస్ ప్రారంభించారు. తొలి రోజు 103 మందికి కంటి పరీక్షలు నిర్వహించారు. రైతు సంఘం నాయకులు హనుమానుల సురేంద్రనాథ్ బెనర్జీ, పెద్దాశ్రమం కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

22 నుంచి కళాశాలల నిరవధిక బంద్

మచిలీపట్నంటౌన్: సమస్యల పరిష్కారం కోరుతూ కృష్ణా యూనివర్సిటీ పరిధిలోని పలు ప్రైవేటు కళాశాలల యాజమాన్య సంఘ నాయకులు ఈనెల 22వ తేదీ నుంచి కళాశాలల నిరవధిక బంద్ చేయాలని నిర్ణయించారు. ఈ మేరకు గురువారం స్థానిక ఎస్ఎస్ఆర్ డిగ్రీ కళాశాలలో సంఘ సమావేశాన్ని నిర్వహించారు. కళాశాలల అఫీలియేషన్ ఫీజును చెల్లించడానికి చివరి తేదీని పెంచాలని, ప్రాసెసింగ్ ఫీజును మాఫీ చేయాలని, అఫీలియేషన్ ఫీజును విద్యార్థుల సంఖ్యను ఆధారంగా వసూలు చేయాలని సమావేశం ఏకగ్రీవంగా తీర్మానించింది. ఈ డిమాండ్ల పరిష్కారం కోరుతూ ఈనెల 22వ తేదీ నుంచి నిరవధిక బంద్ పాటించాలని నిర్ణయించింది. దీనికి సంబంధించి యూనివర్సిటీ వైస్ చాన్స్‌లర్ రాంజీకు వినతి పత్రాన్ని గురువారం అందజేశారు. ఆ సంఘ రాష్ట్ర అసోసియేషన్ బాధ్యుడు ఎలమంచిలి శివనాగేంద్రప్రసాద్, కృష్ణ యూనివర్సిటీ ప్రైవేటు కళాశాల యాజమాన్య సంఘం అధ్యక్షుడు గోపు చక్రధర్, కళాశాలల యాజమాన్య సంఘ సభ్యులు పాల్గొన్నారు.

రసాయనిక ఎరువులను తగ్గించాలి



ఘంటసాల: పంటల సాగులో రసాయనిక ఎరువుల వినియోగం తగ్గించాలని కేవీకే సమన్వయకర్త డాక్టర్ డి.సుధారాణి రైతులకు తెలిపారు. ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం వారి ఘంటసాల కృషి విజ్ఞాన కేంద్రంలో ఇఫ్కో కంపెనీ సహకారంతో ఖరీఫ్ పంటల సాగులో మేలైన యాజమాన్య పద్ధతులపై అవగాహన, చర్చాగోష్ఠి కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ సుధారాణి ప్రస్తుత వరిసాగులో యాజమాన్య పద్ధతులను, ఎలుకల నివారణ యాజమాన్య పద్ధతులు, చేపట్టాల్సిన మెలకువలు గురించి రైతులకు వివరించారు. కేవీకే శాస్త్రవేత్తలు రేవతి, మంజువాణి, వెంకటలక్ష్మి, యశ్వంత్, నవీన్, ఇఫ్కో మేనేజర్ నంద కిషోర్, మండల ఇన్‌చార్జి ఏవో డి.అనూష తదితరులు పాల్గొన్నారు.